# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ వాతావరణ మార్పుల దుష్ప్రభావాలను తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం తప్పనిసరని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

❖ "నషా ముక్త్ యువ అభియాన్"లో భాగంగా దేశవ్యాప్తంగా "రాష్ట్రీయ సంకల్ప్ సమారోహ్" కార్యక్రమాలను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది.

❖ ఆసియా క్రీడల పోటీల్లో తొలిరోజు షూటింగ్‌లో భారత్ రెండు రజత పతకాలను గెలుపొందగా.. మహిళల క్రికెట్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంది.

❖ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి ఈనెల 22 నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

==============================

వాతావరణ మార్పుల దుష్ప్రభావాలను తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం ఆవశ్యకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన 'వాతావరణం, పర్యావరణ పరిణామాల భవిష్యత్' సదస్సు ముగింపు సమావేశంలో రాష్ట్రపతి ఈరోజు ప్రసంగించారు. ఈ తీవ్ర సమస్యను అడ్డుకునేందుకు స్థానిక, ప్రాంతీయ, ప్రపంచ స్థాయిలో భాగస్వాములంతా క్రియాశీలక సహకారంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. వాతావరణ మార్పుల వల్ల మానవాళి మనుగడలోనే తీవ్ర అసమతుల్యతలు తలెత్తుతున్నాయని, జీవవైవిధ్య క్షీణత, నీటి ఎద్దడి, భూసారం తగ్గడం వంటివి ఇందుకు ఉదాహరణలని తెలిపారు. దేశంలో పర్యావరణ సంబంధిత న్యాయపరమైన వ్యవహారాల్లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (NGT) కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్రపతి పేర్కొంటూ…

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్య సమితి 81వ సర్వసభ్య సమావేశం 'హై లెవల్ వీక్'కు భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ నాయకత్వం వహించనున్నారు. భారత ప్రతినిధి బృందంతో కలసి ఆయన ఈ భేటీకి హాజరుకానున్నారు. ఈ నెల 26వ తేదీన ఐరాస 81వ సర్వసభ్య సమావేశంలో కేంద్రమంత్రి జైశంకర్ ప్రసంగించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాల్లో కూడా జైశంకర్ పాల్గొననున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు 'నషా ముక్త్ యువ అభియాన్'లో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 'రాష్ట్రీయ సంకల్ప్ సమారోహ్' కార్యక్రమాలను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. 'వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువ - 100 వారాల ప్రచారం' పేరిట చేపట్టిన ఈ ఉద్యమంలో యువత పెద్ద ఎత్తున భాగస్వాములవుతున్నారు. దేశ వ్యాప్తంగా మొత్తం 1,067 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు సాగుతుండగా... ఇందులో 471 `మై భారత్` జిల్లా కార్యాలయాలతో పాటు మరో 596 సంస్థలు భాగస్వామ్యమయ్యాయి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ, నాటికలు, చర్చల ద్వారా ఈ ప్రచార సందేశాన్ని నేరుగా యువతలోకి తీసుకెళ్లడమే ఈ సమారోహ్ ముఖ్య ఉద్దేశం.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేపాల్ వరదల వల్ల ఇప్పటివరకు 1,400 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. గల్లంతైన మరో 6 వేల మంది కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. రసువా, దాని పరిసర జిల్లాల్లోని నదీ పరివాహక ప్రాంతాలు, తీవ్రంగా దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులు, కొండచరియల శిథిలాల వద్ద సహాయక బృందాలు గాలిస్తున్నాయి. బాధితులు చిక్కుకుపోయిన కొన్ని సొరంగాల నుంచి శిథిలాలను తొలగించడానికి మూడు నుంచి నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉందని నేపాల్ అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూకశ్మీర్ శాసనసభ శీతాకాల సమావేశాలు రేపటి నుంచి శ్రీనగర్‌లో ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30 వరకు 10 రోజుల పాటు కొనసాగే ఈ అసెంబ్లీ సమావేశాల్లో మొత్తం 7 సిట్టింగ్‌లను నిర్వహించనున్నారు. ఈ సమావేశాల సందర్భంగా జీఎస్టీ (GST), మున్సిపల్ గవర్నెన్స్, సులభతర వాణిజ్యం వంటి అంశాలకు సంబంధించిన పలు బిల్లులను, శాసన ప్రతిపాదనలను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టే అవకాశముంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 138వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 25వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో పోటీపడుతున్న భారత క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు అక్కడి భారతీయులు 'సండేస్ ఆన్ సైకిల్' పేరిట సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ పాల్గొని ప్రవాస భారతీయులతో కలసి సైకిల్ తొక్కి సందడి చేశారు. ఆసియా క్రీడల్లో భారత

అథ్లెట్లకు అండగా నిలుస్తూ.. ప్రవాస భారతీయులు చూపిస్తున్న మద్దతును మంత్రి మాండవీయ ఈ సందర్భంగా కొనియాడారు. క్రీడాకారులకు అండగా నిలుస్తున్న భారతీయ సమాజం పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. భారత క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి మంచి పేరు తెస్తారనే నమ్మకాన్ని కేంద్రమంత్రి వ్యక్తం చేశారు.

(వాయిస్ 16 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో రజత పతకం సాధించిన భారత షూటర్ ఎలవేనిల్ వలరివన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం వేదికగా స్పందించిన రాష్ట్రపతి.. ఎలవేనిల్ అసాధారణ ప్రదర్శన దేశానికి ఎంతో గర్వకారణమని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ... భవిష్యత్‌లో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో రజత పతకం సాధించిన భారత మహిళల జట్టును కూడా వారు ప్రశంసించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జపాన్ వేదికగా ప్రారంభమైన ఆసియా క్రీడలు-2026లో పోటీల తొలిరోజే షూటింగ్‌లో భారత్ రెండు రజత పతకాలను గెలుపొందింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో ఎలవేనిల్ వలరివన్, విదర్శ వినోద్, సోనమ్ మస్కర్‌ల త్రయం రజతం సాధించగా... వ్యక్తిగత విభాగంలోనూ ఎలవేనిల్ మరో రజతాన్ని గెలుచుకుంది. మరోవైపు మహిళల క్రికెట్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లి స్వర్ణ పతకాన్ని ఖరారు చేసుకుంది. సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌పై 114 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన భారత్.. పసిడి పోరులో శ్రీలంకతో తలపడనుంది. ఇటు మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో సుచికా తరియాల్ మహిళల ట్రెడిషనల్ 60 కేజీల సెమీఫైనల్‌కు చేరడం ద్వారా ఆసియా క్రీడల మార్షల్ ఆర్ట్స్‌లో భారత్‌కు తొలి పతకాన్ని ఖాయం చేసిన అథ్లెట్‌గా నిలిచారు. హాకీలోనూ భారత పురుషుల జట్టు పూల్-ఎ మ్యాచ్‌లో ఇండోనేషియాను 13-1 తేడాతో ఓడించగా, మహిళల జట్టు పూల్-బిలో ఉజ్బెకిస్థాన్‌పై 19-0తో విజయాన్ని నమోదు చేసింది. బ్యాడ్మింటన్‌లో భారత మహిళల జట్టు ప్రీ-క్వార్టర్స్‌లో కజకిస్థాన్‌పై 3-0తో గెలిచి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. టేబుల్ టెన్నిస్‌లో భారత మహిళల జట్టు ఇండోనేషియాపై 3-0తో, సింగపూర్‌పై 3-2తో వరస విజయాలు సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా మారిందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ.. రేపటికి వాయుగుండంగా, ఈనెల 22 నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే 23కి ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరానికి సమీపంలోకి వచ్చే అవకాశం ఉందని, 23, 24వ తేదీల్లో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. సెప్టెంబరు 22 నుంచి 25 వరకు తెలంగాణ, చత్తీస్‌గఢ్, విదర్భ, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. నైరుతి రుతుపవనాల ఉపసంహరణకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, రాబోయే 2 నుంచి 3 రోజుల్లో రాజస్థాన్, పంజాబ్ లోని మరికొన్ని భాగాల నుంచి రుతుపవనాలు వైదొలిగే అవకాశం ఉందని IMD పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =